క్లుప్తంగా...

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ



మౌలాలి: బోనాల పండగ నేపథ్యంలో మౌలాలి భరత్‌నగర్‌లోని శ్రీమహంకాళీ ఆలయంలోని ముగ్గురు అమ్మవార్లకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ పట్టువస్త్రాలు, అలంకార సామాగ్రిని అందజేశారు. శనివారం పార్టీ డివిజన్ అధ్యక్షుడు వంశీ ముదిరాజ్ దేవాలయంలో అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజేష్‌యాదవ్, సభ్యులు సుధాకర్, రామకృష్ణ, సత్యనారాయణ, మహేష్‌గౌడ్, మురళీ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



రామంతాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులై ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన కేంద్ర టూరిజం శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని శనివారం రామంతాపూర్ బీజేపీ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ ఉప్పల్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఇల్లితం నరసింహారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వెంపటి శ్రీను, నగేష్, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

అభినందనలు



కుషాయిగూడ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన బీజేపీ ఉప్పల్ నేత ఎనుముల మహేష్‌కుమార్ శనివారం కలిశారు. ఆయనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈవెంట్ నిర్వాహకులపై కేసు నమోదు

ఉప్పల్: అనుమతి లేకుండా అర్ధరాత్రి వరకు ఈవెంట్ నిర్వహించిన నిర్వాహకులపై ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాలు.. శుక్రవారం అర్ధరాత్రి వరకు ఉప్పల్ ఆదర్శ్‌నగర్‌లోని ఓ మినీ హాల్‌లో ఈవెంట్ నిర్వహించారు. ఎక్సైజ్ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా ఈవెంట్ నిర్వహించడంతో సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ పోలీసుల అనుమతి లేనిదే ఎలాంటి ఈవెంట్స్ నిర్వహించ వద్దని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు.

సమాజ శ్రేయస్సుకే సైకిల్ యాత్ర

కీసర: జల, జంతు, వన సంరక్షణ నినాదంతో కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింగనూరు వాసి చాటాత్రి విజయగోపాలకృష్ణ కొన్ని నెలలుగా సైకిల్ యాత్ర చేస్తున్నాడు. శనివారం కీసర మండల కేంద్రానికి చేరుకున్నాడు. కీసరలోని శ్రీరామలయ కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. 2022 మార్చి 11న స్వగ్రామం నుంచి బయలుదేరి 560 రోజుల్లో 16 రాష్ట్రాలు, అనేక దేవాలయాలు, అడవులు, జంతువులు, నదులను సందర్శించినట్లు తెలిపారు. కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వర స్వామిని దర్శించుకొని కొమరవెల్లి శ్రీమల్లికార్జున స్వామివారిని దర్శించుకొని నగరానికి బయలుదేరతానని తెలిపారు.

అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు

ఘట్‌కేసర్: ఆలయ భూమి విషయంలో అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని, నాయకులు తెలుసుకొని మాట్లాడాలని ప్రతాపసింగారం సర్పంచ్ వంగూరి శివశంకర్ అన్నారు. ప్రతాపసింగారంలో శనివారం స్థానికులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని సర్కారు భూమిలో ముత్తయ్య అనే వ్యక్తి ఆలయం నిర్మించి, ఇతరులకు సమాచారం ఇవ్వకుండా ట్రస్ట్ ఏర్పాటు చేసి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాడని, ప్రశ్నిస్తే దౌర్జన్యం అంటున్నాడన్నారు. ఆలయ విషయం పార్టీలకు అంటగట్టడం సరికాదని, మండల నాయకులు నిజానిజాలు తెలుసుకొని ఆరోపణలు చేయాలని హితువు పలికారు. గ్రామ ఆలయంపై ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే పంచాయతీ పాలకవర్గం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. వార్డు సభ్యులు గోవర్ధన్, సుధాకర్, మాజీ ఉప సర్పంచ్ స్వామి గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్షాకాలం..
కరెంటుతో జాగ్రత్త



హబ్సిగూడ సర్కిల్ ఎస్‌ఈ రాముడు

ఉప్పల్: విద్యుత్ వినియోగదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలను పాటించాలని కోరుతూ ఉప్పల్ ఎస్‌ఈ కార్యాలయంలో విద్యుత్ అధికారులు శనివారం విలేకరుల సమవేశాన్ని ఏర్పాటు చేశారు. ఎస్‌ఈ రాముడు, డీఈలు సూర్యనారాయణ, సాయిప్రసాద్, భాస్కర్, సుభాష్ ఇతర అధికారులతో కలిసి మాట్లాడారు. వర్షాకాలం సందర్భంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లొద్దని, రోడ్డు మీద వైర్లు తెగిపడి ఉంటే తాకొద్దని, వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ లేకపోతే సమాచారం అందించాలన్నారు. విద్యుత్ బిల్లులను సాధ్యమైనంత వరకు ఆన్‌లైన్, ఇతర అన్ని యాప్‌ల ద్వారా చెల్లించేందుకు ప్రయత్నించాలని సూచించారు. దాదాపు 70 శాతం వరకు ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినా, బిల్లుల్లో ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా ఫోన్: 94910 39018కు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు. ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదు చేసుకోవచ్చని, టీఎస్ఎస్‌పీడీసీఎల్ మొబైల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా చేయవచ్చన్నారు.

అత్యవసర సమయాల్లో ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్లు..

హబ్సిగూడ	9490153524
నాచారం	9490153525
మల్లాపూర్	7382299012
ఉప్పల్	9490153530
బోడుప్పల్	9491039017
చిలుకానగర్	7382298965
రామంతాపూర్	9490153532
సైనిక్‌పురి	9490153548
యాప్రాల్	9490153555
కుశాయిగూడ	9490153550
చర్లపల్లి–1–2	8331043125
ఏఎస్‌రావునగర్	9493586559
నేరేడ్‌మెట్	9490153541
మల్కాజిగిరి	9490153537
గౌతంనగర్	9490153540
వినాయక్‌నగర్	9490153545
వసంతపురి	9490153543
కీసర	9912192008
నాగారం	9490138363
బాలాజీనగర్	8333924865
దమ్మాయిగూడ	7382298952
ఘట్‌కేసర్	9490153534
నారాపల్లి	9491030107
ఫిర్జాదిగూడ	8985968264

హబ్సిగూడ సర్కిల్(మూడు డివిజన్లు) పరిధిలో దాదాపుగా 8 లక్షల 40 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని ఎస్‌ఈ రాముడు తెలిపారు.

తవ్వేశారు.. వదిలేశారు..



హెచ్‌బీకాలనీ మంగపురం కాలనీలో తవ్వి వదిలేసిన రోడ్డు

- పనులు పూర్తయ్యి మూడు నెలలు..
- మరమ్మతులు లేని మంగపురం రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

కుషాయిగూడ: అభివృద్ధి పనుల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పనుల కోసం ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి వదిలేశారు. దీంతో రోడ్లు గుంతలమయంగా మారాయి. కనీసం మట్టి కుప్పలు కూడా ఎత్తకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని మంగపురం కాలనీలో రూ.1.7 కోట్లతో బాక్స్‌డ్రైన్ పనులు చేపట్టారు. పనులు చేపట్టే క్రమంలో కాలనీలోని రోడ్డును తవ్వారు. పనులు పూర్తిచేశారు. పనులు పూర్తయ్యి మూడు నెలలు గడుస్తున్నా తవ్విన రోడ్డుకు మాత్రం మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. రోడ్డంతా గుంతలమయంగా మారిందని, ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇళ్ల ముందు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా రోడ్డుకు మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తవ్వేసిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నేత గణేష్ ముదిరాజ్

గౌతంనగర్: మల్కాజిగిరి సాయినగర్‌కు చెందిన బీఆర్ఎస్ మల్కాజిగిరి నియోజకవర్గం ఉపాధ్యక్షుడు జిన్న గణేష్ ముదిరాజ్ బీజేపీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి, ఉపాధ్యక్ష పదవికి శనివారం రాజీనామా చేశారు. అనంతరం బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు వీకే మహేష్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ ముదిరాజ్ మాట్లాడుతూ బీజేపీ అభివృద్ధి కార్యక్రమాలు, పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితుడై పార్టీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో మడిపడిగా జగదీష్‌గౌడ్, మోహన్ యాదవ్, ధనుంజయ్, వెంకటేష్ ముదిరాజ్ ఉన్నారు.



గణేష్‌ముదిరాజ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఈటల రాజేందర్

వర్షం కురుస్తున్నప్పుడు జాగ్రత్తలు పాటించండి

బోడుప్పల్: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని శనివారం 18వ డివిజన్ కార్పొరేటర్ పులకండ్ల హేమలతా జంగారెడ్డి డివిజన్‌లో పర్యటించారు. ఉదయ్‌నగర్, ఈస్ట్ హనుమాన్ నగర్, సాయిరాంనగర్, అల్మాస్‌కుంటను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలు, భారీ చెట్ల కింద నిల్చోవద్దని సూచనలు చేశారు. పర్యటనలో సీనియర్ నాయకులు పులకండ్ల జంగారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి రవికాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

వైన్స్ షాపులో చోరీ

శామీర్‌పేట్: వైన్ షాపులో చోరీ జరిగిన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ గ్రామంలోని తిరుమల వైన్స్ షాపును నిర్వాహకుడు శ్రీను శనివారం ఉదయం వైన్స్ షాపు షెటర్ తెరిచి ఉండటాన్ని ఓ వ్యక్తి గుర్తించి యజమానికి, పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. క్యాష్ కౌంటర్‌లో రూ.15 వేలు, 9 మద్యం బాటిళ్లు చోరీకి గురైనట్లు యజమాని పోలీసు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ

శామీర్‌పేట్: బొమ్మరాశిపేటలో చోరీ జరిగిన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగు చూసింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేట గ్రామంలో మామిడి చిన్న బాలమణి నివాసం ఉంటోంది. ఈ నెల 10న కుత్బుల్లాపూర్‌లో ఉండే తన కూతురు ఇంటికి వెళ్లింది. శనివారం ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు విషయాన్ని ఫోన్ ద్వారా ఆమెకు సమాచారం అందించారు. అల్మారలోని రూ.15 వేలు, 10 కొత్త చీరలు చోరీకి గురైనట్లు పోలీసులకు సమాచారం అందించింది. శామీర్‌పేట పోలీసులు ఆధారాలు సేకరించారు. గ్రామంలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

భగవద్గీత సారాంశాన్ని అందరూ తెలుసుకోవాలి



భక్తులకు ప్రవచనాలను చెప్తున్న శ్రీమాన్ శ్రీహర్ష

మల్లాపూర్: భగవద్గీత సారాంశాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఇస్కాన్ సంస్థ వ్యక్త శ్రీమాన్ శ్రీహర్ష అన్నారు. శనివారం నాచారం మహంకాళి దేవాలయంలో అధిక శ్రావణ మాసం పురస్కరించుకొని ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో భగవత్ సంకీర్తన, భగవద్గీత ప్రవచనాలను బోధించారు. కార్యక్రమంలో వేదాంత లక్ష్మి నర్సింహచార్యులు, మల్కా ప్రకాష్, పోగుల వెంకట రమణారెడ్డి, రాగిరి మోహన్‌రెడ్డి, యుగేందర్, ప్రసాద్, అనితారెడ్డి, విద్యులత, నవీన్, రవికాంత్, రాజు, పెద్దఎత్తున మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ స్థలాన్ని పరిరక్షించాలి

మల్లాపూర్: మల్లాపూర్ ఈస్ట్ అన్నపూర్ణ కాలనీ కమ్యూనిటీ హాల్ స్థలాన్ని పరిరక్షించాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు కోరుతున్నారు. కమ్యూనిటీ హాల్ 870 గజాల్లో ఉండగా కొంత స్థలాన్ని దేవాలయానికి కేటాయించారు. రూ.లక్షలు విలువ చేసే కమ్యూనిటీ స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ అధికారులదేనన్నారు. కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకొని స్థలాన్ని సంరక్షించి ప్రహరీ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్లకు త్వరగా మరమ్మతులు చేపట్టండి



ఉప్పల్ రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ నల్ల పోచమ్మ బోనాల సందర్భంగా శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి స్థానిక జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్ల మరమ్మతులు, వీధి దీపాలు, లైటింగ్ తదితర ఏర్పాట్లపై ఆరా తీశారు. గుంతలు ఉన్న చోట్ల రోబో సాండ్ వేయాలని, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, పోగుల దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

హబ్సిగూడ: ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురు సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు శనివారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, మధుసూదన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, తిరుమలేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ట్రాఫిక్ సీఐ

ఉప్పల్ ట్రాఫిక్ నూతన సీఐ కృష్ణమోహన్ శనివారం హబ్సిగూడలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఓటరు లిస్టు సవరణలపై అవగాహన

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం బూత్ లెవెల్ ఆఫీసర్లు, ఎలక్షన్ సూపర్‌వైజర్లకు, ఎలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో శామీర్‌పేట తహసీల్దార్ ఎం.వెంకటనర్సింహారెడ్డి ఓటరు లిస్ట్, సవరణలు, మార్పులు, చేర్పులు, చేసేందుకు చేపట్టాల్సిన చర్యలు బీఎల్‌వో యాప్‌పై అవగాహన కల్పించారు. కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో బీఎల్‌వోలు నిష్పక్షపాతంగా సర్వే చేయాలన్నారు. బీఎల్‌వోలు ఓటరు జాబితా విషయంతో కీలక పాత్ర పోషించాలని, ట్రైనర్ చెప్పినట్లు సూచనలు పాటించాలని ఆదేశించారు. అనంతరం బీఎల్‌వోలకు 20 ప్రశ్నలతో కూడిన పరీక్ష నిర్వహించారు. బీఎల్‌వో సర్వేపై నిరంతరం సూపర్‌వైజర్ల పర్యవేక్షణ ఉండాలన్నారు.

పాపం పసిపాప



లాలాపేట: ఓ పసికందు (10–15 రోజులు)ను చెట్ల పొదల్లో వదిలేసిన అమానవీయ ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఉదయం జామై ఉస్మానియా ప్రాంతంలోని అడిగ్‌మెట్ ఫ్లైఓవర్ సమీపంలో చెట్ల పొదల్లో చిన్నారి ఏడుపును గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఆడ శిశువును చేరదీసి యూసూఫ్‌గూడలోని శిశువిహార్‌కు తరలించారు. కుక్కలు, ఇంకా ఏవైనా జంతువుల చూసినట్లయితే పరిస్థితి దారుణంగా ఉండేదని స్థానికులు వాపోతున్నారు.

త్వరితగతిన పనులు చేపడతాం

అల్వాల్: అల్వాల్ డివిజన్ పరిధిలోని బండ బస్తీలో కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో సీసీ రోడ్లు, సీవరేజ్ లైన్, స్తంభాలతోపాటు వీధి దీపాల ఏర్పాటు వంటి సమస్యలను గుర్తించారు. త్వరితగతిన పనులు చేపడుతామని స్థానికులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు. అనంతరం సర్కిల్ డీఈ పవన్‌తో కలిసి చినరాయుడి చెరువును పరిశీలించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఉదయ్, అరవింద్, కవిత, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.



అల్వాల్ బండబస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి

రోడ్డు కటింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోండి



ఆనంద్‌బాగ్‌లో రోడ్డు కటింగ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లో అనుమతి లేకుండా రోడ్డు కటింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ శ్రవణ్ డిమాండ్ చేశారు. ఆనంద్‌బాగ్ నుంచి ఈస్ట్ ఆనంద్‌బాగ్ ఆర్‌యూబీ వరకు రోడ్డు కటింగ్ చేశారని, డిప్యూటీ కమిషనర్‌ను వివరణ కోరితే తనకు తెలియదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. రోడ్డు కటింగ్ చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు.

ఉప్పల్ నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని వినతి

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయాలని, నియోజకవర్గంలో డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలని, కాప్రా, చర్లపల్లి, రామంతాపూర్ చెరువుల వద్ద సూర్యభగవాన్, ఛత్ పూజలకు ప్రత్యేక కొలనులను ఏర్పాటు చేయాలని, జీవో–58, 59 దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు త్వరగా పట్టాలు పంపిణీ చేయాలని కోరినట్లు ఆయన వివరించారు. ఇందుకు కలెక్టర్ అమయ్ కుమార్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, లేతాకుల రఘుపతిరెడ్డి, కాటేపల్లి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ అమయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

ఆగిన వర్షం.. రహదారులు అస్తవ్యస్తం



వసంతపురికాలనీలో..

మల్కాజిగిరి: వర్షం కారణంగా మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్లలో పరిస్థితులు కుదుటపడుతున్నాయి. వర్షం నీరు నాలాలో పారుతున్నా రోడ్లు దెబ్బతిన్నాయి. సత్తిరెడ్డినగర్ కాలనీలో డ్రైనేజీ తరచూ పొంగుతుండటంతో మురుగు ప్రవహించి ఇబ్బందులకు గురవుతున్నాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. తగిన చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.



ఎస్పీనగర్ నుంచి ఉప్పరిగూడ రహదారి..



సత్తిరెడ్డినగర్‌లో నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్